వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో చోటు

- పలువురు శ్రీశైలం నియోజకవర్గ నాయకులకు అవకాశం
- అభినందించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అనుభంధ విభాగాల్లో శ్రీశైలం నియోజకవర్గానికి పెద్దపీట వేశారు. పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రకటించిన అనుబంధ సంఘాల కమిటీల్లో నియోజక వర్గ నాయకుల వివరాలు.. జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా టి .రాజు,సెక్రటరీలుగా రమణ, వెంకటరమణ,జాయింట్ సెక్రటరీలుగా ఎం.మద్దలేటి, కే.వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ కమిటీ జనరల్ సెక్రటరీగా ఏసేబు,కార్యదర్శులు జి.జ్ఞానాయుధం,నల్లాడి,జాయింట్ సెక్రటరీలుగా జి.సత్యరాజు,బి.దర్శనం ఎంపికయ్యారు. జిల్లా సాంస్కృతిక విభాగం కమిటీ జనరల్ సెక్రటరీగా డి.వెంకటస్వామి,సెక్రటరీగా ఎస్.శివరాముడు,జాయింట్ సెక్రటరీ ఎస్.షేక్ ఎంపిక కాగా జిల్లా ఐటీ విభాగం కమిటీలో వైస్ ప్రెసిడెంట్ గా సునీల్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా మోహన్ గాంధీ, సెక్రటరీలుగా షేక్ సాదిక్ బాషా,షేక్ రసూల్, జాయింట్ సెక్రటరీ అన్వర్ సాదత్‌ను నియమించారు. జిల్లా మహిళా విభాగం కమిటీలో జనరల్ సెక్రటరీగా దరగమ్మ,సెక్రటరీలుగా జె.లక్ష్మీదేవి, ఎం.సుబ్బమ్మ, జాయింట్ సెక్రటరీగా పి.లక్ష్మీని ఎంపిక చేశారు. జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా యూనస్‌బాషా, జనరల్ సెక్రటరీగా ఇక్బాల్, కార్యదర్శులుగా నబీరసూల్, ఎస్.షేక్షావలి, జాయింట్ సెక్రటరీలుగా మాబు,ఖాదర్‌ను నియమించారు.



జిల్లా పంచాయతీరాజ్ విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా కే.రఘురామిరెడ్డి,జనరల్ సెక్రటరీగా నాగేంద్ర,సెక్రటరీగా రామయోగయ్య,జాయింట్ సెక్రటరీలుగా నాగరాజునాయుడు,మహబూబ్ బాషా ఎంపిక కాగా.. జిల్లా ప్రచార విభాగానికి వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.మద్దిలేటి, జనరల్ సెక్రటరీగా ఎస్.నారాయణ,సెక్రటరీలుగా మురళీకృష్ణ, నాగరాజు, జాయింట్ సెక్రటరీలుగా ఎఫ్.బాషా,గాలి షరీఫ్ ఎంపికయ్యారు. జిల్లా రైతు విభాగం కమిటీలో జనరల్ సెక్రటరీగా సంజీవరెడ్డి,సెక్రటరీలుగా కుళ్లాయి స్వామి రెడ్డి, శివశంకరరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా రామచంద్రారెడ్డి, పక్కీరయ్యను నియమించారు. జిల్లా ఎస్సీ సెల్ కమిటీలో ఉపాధ్యక్షుడిగా కాటిపోగు వెంకటసుబ్బయ్య, జనరల్ సెక్రటరీగా కే. శ్రీనివాసులు,సెక్రటరీలుగా పి.భాస్కర్, అయ్యప్ప,జాయింట్ సెక్రటరీలుగా జే.రాజేశ్,రాజేశ్ ఎంపికయ్యారు. జిల్లా ఎస్టీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా మూగెన్న, జనరల్ సెక్రటరీగా డి.విక్రంసింహ నాయక్, సెక్రటరీలుగా సుధాకర్ నాయక్,మౌలాలి నాయక్,జాయింట్ సెక్రటరీలుగా రాజేశ్ నాయక్, బద్రునాయక్‌ను ప్రకటించారు. జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా వి.సురేష్ రెడ్డి,జనరల్ సెక్రటరీగా మహబూబ్ జుబేర్,సెక్రటరీలుగా ఉదయ్ కిరణ్, మహబూబ్ జుబేర్, జాయింట్ సెక్రటరీలుగా చాంద్ బాషా, అబ్దుల్ రహమాన్‌ను ఎంపిక చేశారు. ఎంపికైన వారిని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అభినందించారు.

క్లుప్తంగా

క్షయను తరిమికొడదాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవికుమార్

కొత్తపల్లి: పౌష్టికాహారం తీసుకొని క్షయ వ్యాధిని తరిమికొడదామని టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ సూచించారు. మండలంలోని శివపురం సచివాలయం పరిధిలోని శివపురం గూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధిపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలలో వైద్యులను సంప్రదించాలన్నారు. పోషకాహారం తీసుకోకపోతే క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుడు వీరన్న, ఎంఎల్‌హెచ్‌పీ తిరుమల, హెల్త్ అసిస్టెంట్ సుదర్శనమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీసభ్యులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు శ్రీచెన్నకేశవస్వామి ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా ముగిసింది. వేంపెంట పశువుల వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ ఎన్నికల అధికారిగా గొర్రెల పెంపకం దారుల ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా చిన్నప్ప, సెక్రెటరీగా వెంకటరమణ, పాలకవర్గ సభ్యులుగా ఈశ్వరయ్య, శ్రీరాములు, తిక్కస్వామి, శ్రీనివాసులు, పుల్లన్నను ఎన్నుకొన్నారు. చిన్నప్ప మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మంజూరయ్యే సంక్షేమ పథకాలను గొర్రెల కాపరులందరికీ అందేలా చేస్తామని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులకు డాక్టర్ భాస్కర్ డిక్లరేషన్ ఫారాలు అందజేశారు.

పథకాలపై అవగాహన ఉండాలి



ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మిడుతూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, పీరుసాహెబ్ పేట గ్రామంలో సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలైన అయుష్మాన్ భారత్, ముద్ర యోజన, ప్రధానమంత్రి, జలజీవన్ మిషన్, పీఎం కిసాన్ కార్డులు, తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఫక్రుద్దీన్, పశువైద్యాధికారి సాయినాథ్‌రెడ్డి, ఎంఈఓ -2 శ్రీనాథ్, ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరమ్మ, ఏపీఎం సుబ్బయ్య, ఏపీఓ జయంతి పాల్గొన్నారు.

అలరించిన భక్తిరంజని



భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢ వీధిలోని నిత్యకళావేదికపై గుంటూరుకు చెందిన ధనలక్ష్మి సంగీత విద్యాలయం వారు నిర్వహించిన భక్తిరంజని భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతిస్తుతి, శివారాధన, బ్రహ్మమురారి, లింగా ష్టకం, మహిషాసురమర్దిని, అఖిలాండేశ్వరి తదితర గీతాలను ఎం.ధనలక్ష్మి, లక్ష్మీలాస్య, జశ్వంత్, పూజ, ఇందుమతి, కార్తికేయ, జ్ఞాపి క, అక్షయ, విజ్ఞత, త్రినాథ్, నాగలక్ష్మీ, ప్రదీప్, పవన్, కోటేశ్వరరావు తదితరులు ఆలపించారు.

పిల్లలను బడికి పంపాలి

శ్రీశైలంప్రాజెక్ట్: బడి ఈడు పిల్లలు బడుల్లోనే ఉండాలని, తల్లిదండ్రులు వారిని పనులకు పంపరాదని ఎంఈఓలు కరీముల్లా, శక్య నాయక్ తెలిపారు. శుక్రవారం డీఏవీ పాఠశాల విద్యార్థులతో కలిసి సున్నిపెంట బస్టాండ్ ప్రాంగణంలో మానవహారం నిర్వహించారు. పిల్లలు బడికి-పెద్దలు పనికి అంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడుతూరు: బడి -ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని వీపనగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రవికుమార్, కడుమూరు హెచ్ఎం శ్రీధర్ కిశోర్ కోరారు. శుక్రవారం మండలంలోని వీపనగండ్ల , కడుమూరు గ్రామాల్లో జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) స్థూల నమోదు నిష్పత్తి సర్వేపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, బడి ఈడు పిల్లను బడిలో చేర్పించాలని సూచించారు. సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగ వివక్ష నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, లింగ వివక్ష పాటించడం చట్టరీత్యా నేరమని వెలుగు ఏపీఎం పుల్లయ్య అన్నారు. స్థానిక మహిళా సమైక్య కార్యాలయంలో లింగ వివక్షపై ఎంపీడీఓ మేరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్త్రీ, పురుషులు సమానంగా ఎదగాలన్నారు. ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయకూడదని సూచించారు. అనంతరం అక్కడి నుంచి అవగాహన ర్యాలీ చేపట్టి బస్టాండ్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించారు. సీసీలు రత్నకుమారి, శివుడు, గోపాల్, చిన్న ముర్తుజా, రామకృష్ణుడు, బాలరాజు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



బహుమతులతో క్రీడాకారులు



పతకాలు సాధించిన డిగ్రీ కళాశాల విద్యార్థులు



బహుమతులు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో నాలుగు రోజుల పాటు జరిగిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో విజేతలకు ఎస్‌డీఆర్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కొండారెడ్డి బహుమతులు అందజేశారు. త్రివేండ్రంలో జరిగే జాతీయ పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల కోచ్‌లు రవికుమార్, దాసు, సాల్మన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, బత్తుల రవికుమార్, అబ్జర్వర్ దిలీప్ పాల్గొన్నారు.

ఆర్‌యూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ..

పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 14న కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బి.రాజేశ్వరి 100మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకం, సి.అనూష వెండి పతకం, కె.శాంతకుమారి 400 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, నాగేంద్రమ్మ 800 మీటర్ల నుంచి 1500 మీటర్లలో వెండి పతకాలు, వెంకటలక్ష్మి 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, మహిళలు 400''100 మీటర్లలో వెండి పతకాలు సాధించారన్నారు. పురుషుల విభాగంలో వెంకట సునీల్ 1500 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం, బ్రహ్మం 100 మీటర్లలో కాంస్య పతకం సాధించారని వివరించారు. విద్యార్థులు, పీడీ శ్రీనివాసులును అధ్యాపకులతో కలిసి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో..

రాష్ట్రస్థాయి 67వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో జరిగిన బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో బాలా అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, రవీంద్ర తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ అండర్-17 బాలికల విభాగంలో 46-48 కేజీల్లో ఎస్.అఫియా బ్రాంజ్ పథకాలు, 63, 66 కేజీల్లో దీపిక బ్రాంజ్ పథకాలు, 80 ప్లస్ కేజీల్లో శరణ్య సిల్వర్ పథకం, బాలురలో అండర్-14, 44-46 కేజీల్లో రంజాన్, షరీఫ్ బ్రాంజ్ పథకాలు 48-50 కేజీల్లో లిఖిత్ అశ్విన్ బ్రాంజ్ పథకం, అండర్-17లో 63-66 కేజీల్లో ఎస్.తౌసిక్ బ్రాంజ్ పథకం, 80ప్లస్ కేజీల్లో మహమ్మద్ జోసెబ్ సిల్వర్ పథకం సాధించారని వివరించారు. విద్యార్థులు, కోచ్ మహేష్ యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాసులును అభినందించారు.

21న జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలు

పాములపాడు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 21న మండల కేంద్రంలో జిల్లాస్థాయి క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అనిల్, ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 21న ఉదయం 9గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుము చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేల చొప్పున నగదు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్: 7993008692, 7207132039 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రీడా పోటీలు వాయిదా

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు వాయిదా పడ్డాయని ఎంపీడీఓ మేరి శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని క్రీడాకారులను గుర్తించి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. శుక్రవారం మండలంలోని 11 సచివాలయాల పరిధిలో నిర్వహించాల్సి ఉండగా వాయిదా పడ్డాయని, ఈనెల 26వ తేదీ నుంచి పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అప్పటి వరకు క్రీడాకారులకు క్రీడా నియమావలిపై వలంటీర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

17న ఉచిత వైద్య శిబిరం

నందికొట్కూరు: ఈనెల 17వ తేదీన పట్టణంలోని నవనంది స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఉచిత సంతాన సాఫల్యతా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరస్పాండెంట్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. శిబిరంలో పాల్గొనే వారికి కర్నూలు వారి ప్రైమ్ ప్లస్ ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. పేర్లు నమోదుకు సెల్:89777 78184, 95504 44641, 95504 44642 ఫోన్ చేయాలని సూచించారు.

వైభవంగా మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించి గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు చేపట్టారు. బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

రేపటి నుంచి తిరుప్పావై ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్ రామాలయంలో ఈనెల 17వ తేదీ నుంచి తిరుప్పావై దివ్యప్రవచనాలు ఏర్పాటు చేస్తున్నట్లు భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, మధుసూదన్ శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలో కరపత్రాలను విడుదల చేసి వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం దివ్యప్రబంధ ప్రాజెక్టు సౌజన్యం, నందిరైతు సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతి రోజూ సాయంత్రం 7గంటల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు తిరుప్పావై ప్రవచనాలు వినిపిస్తారని చెప్పారు. 23న వైకుంఠ ఏకాదశి రోజున వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 29న అష్టోత్తర శత కలశాభిషేకం , జనవరి 4న స్వామివారి తిరుప్పావడ సేవ, 6న ఊంజల సేవ, 12న లక్ష తులసీ పూజ, 14న గోదాదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం ఉంటుందని వివరించారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

మిడుతూరు: బాల్యం నుంచే ఆధ్యాత్మిక భావాలను అలవరుచుకునేలా పిల్లల పెంపకం ఉండాలని శ్రీ దత్త ఆశ్రమ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు, గురుసిద్ద నాగసాయి బ్రహ్మ విద్యా ఆశ్రమం సద్గు రు రామానంద స్వామి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని సమరసత సేవా పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను మరుగున పడకుండా భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భగవద్గీత శ్లోకాలు, మహాభారతం, రామాయణంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలి



నందికొట్కూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న దృశ్యం



శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో అమరజీవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మహానందిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్

నందికొట్కూరు: పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాగసత్యనారాయణ పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఆర్యవైశ్య సంఘం సభ్యులు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడానికి పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాన్ని మరువరాదన్నారు. సంఘం సభ్యులు నాయకులు నాగేశ్వరరావు, వీ.ఆర్ శ్రీనివాసులు, బచ్చు శ్రీనివాసులు, కల్కి శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, జేసీపీ కన్వీనర్ అబూబక్కర్, నాయకులు జబ్బార్, రమేష్, శాలుబాషా, కురవ శ్రీను, రిటైర్డు ఎంఈఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ఆంధ్ర రాష్ట్ర సాధకుడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టులో మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. అసోసియేషన్ నాయకుడు సోమిశెట్టి మల్లికార్జున మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన సమరయోధుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు గెల్లి.వెంకటేశ్వర్లు, కాలువ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

మహానంది: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని మహానంది తహసీల్దార్ జనార్దన్ శెట్టి తెలిపారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మహానందిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

19న మినీ జాబ్ మేళా

శిరివెళ్ల: ఈ నెల 19వ తేదీన యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి నుంచి పీజీ చేసిన వారు హాజరు కావచ్చన్నారు. జపనీస్ ఆటో మొబైల్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్ ఆధ్వర్యంలో మేళా నిర్వహిస్తున్నారని చెప్పారు. అర్హతలను బట్టి రూ. నెలకు రూ.15 వేల నుంచి ఏడాదికి రూ.2.80 లక్షలు వేతనం చెల్లిస్తారన్నారు.18 -27 ఏళ్ల వయస్సున్న వారు అర్హులన్నారు. విద్యార్హత ధ్రువ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఆళ్లగడ్డ: ఈ నెల 19వ తేదీన యర్రగుంట్ల జీటీఆర్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామని స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ మాధవ్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న జాబ్‌మేళాలో 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ అర్హత కల్గిన అభ్యర్థులు ధ్రువ ప్రతాలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఫోన్ 9440224291, 9701303790 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వేతనాలు పెంచాలి

గోస్పాడు: అంగన్‌వాడీ వర్కర్ల వేతనాలు పెంచాలని ఆ సంఘం నాయకురాళ్లు నిర్మలమ్మ, రమణమ్మ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం రిలే దీక్ష నిర్వహించారు.

ఉయ్యాలవాడ : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె నాలుగవ రోజుకు చేరింది. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట శుక్రవారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు.

సూచికలు ఏర్పాటు చేయండి సార్!



ప్రమాదకరంగా ఉన్న మలుపు

జూపాడుబంగ్లా: స్థానిక ఆర్టీసి బస్టాండ్‌కు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద నిత్యం ద్విచక్రవాహనాల దారులు ప్రమాదాలకు గురవుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదకరమైన మలుపు వద్ద ఎలాంటి సూచికలు లేకపోవటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికితోడు మలుపుకు కాస్త ముందుగా స్పీడ్‌బ్రేక్ వేయాల్సి ఉండగా.. మలుపు వద్దే వేయడంతో ప్రమాదాలకు మరో కారణంగా మారింది. వేగంగా వచ్చే వాహనదారులు స్పీడ్‌బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయాల్సి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గోవులకు వ్యాధి నిరోధక టీకాలు



గోవుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణశాలలోని 700పైగా గోవులకు శుక్రవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి సాధారణంగా గోవులలో వచ్చే సీజనల్ వ్యాధులైన గాలికుంటు, నోటిపూత రాకుండా ఉండేందుకు గాను ఎఫ్.ఎం.డీ టీకాలను వేశారు. హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇమ్యునాలాజికల్ కంపెనీ వారు టీకా మందును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గోశాల పర్యవేక్షకులు బి.శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ బి.హనుమంతు, వెటర్నరీ అసిస్టెంట్లు జి.జయరాములు, పి.నగాన్న, మనీషా, గోశాల సిబ్బంది, సున్నిపెంట పశువుల అసుపత్రి ఓ.ఎస్ తిమ్మయ్య పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంతో దిగుబడులపై అంచనా



ప్రయోగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు: పంట కోత ప్రయోగంతో దిగుబడులు అంచనా వేసేందుకు వీలవుతుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. మండలంలోని ఎం.చింతకుంట్ల గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట కోతలో వరిలో పంటకోత ప్రయోగాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 25 చదరపు మీటర్లలో చేయగా 19 కేజీల 250 గ్రాములు దిగుబడి వచ్చిందని తెలిపారు. ఏఓ స్వప్నికారెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు



రైతుకు లింగాకర్షక బుట్టలు అందజేస్తున్న శాస్త్రవేత్త రామకృష్ణారావు

మిడుతూరు: మిరప సాగులో సస్యసంరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉమ్మడి జిల్లా ఏరువాక కేంద్రం , ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు తెలిపారు. మండల కేంద్రమైన మిడుతూరు, తలముడిపి, గడివేముల మండలం బిలకల గూడురు గ్రామాల్లో ప్రదర్శన క్షేత్రాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మిరపలో పైముడత, కింది ముడత తెగుళ్లు ఉన్నట్లు గుర్తించామని, వీటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎకరానికి పసుపు రంగు 50 అట్టలు,నీలిరంగు 50 అట్టలు, తెలుపు రంగు 20 అట్టలు, జిగురు అట్టలతోపాటు 500 మిల్లీ లీటర్ల వేపనూనెను పిచికారీ చేయాలని చెప్పారు. రైతులకు జిగురు అట్టలతో పాటు మందులు పంపిణీ చేశారు. ఏఓ పీరు నాయక్, ఆత్మ బీటీఎం మహేశ్వరమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, రైతులు సూరిబాబు, నాగన్న , సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

నందికొట్కూరు/జూపాడుబంగ్లా/పగిడ్యాల/కొత్తపల్లి/వెలుగోడు: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు శుక్రవారం నల్లని దుస్తులతో జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వెలుగోడులో చేపట్టిన సమ్మెకు పలు ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, కిషోర్, కృష్ణ, వెంకటయ్య, ప్రవీణ్, బీసీ నాయకులు రఘు రాముడు, రమణ, ఎల్లా గౌడ్,ఎమ్మార్పీఎస్ నాయకులు నాగశేషులు, ఆరోగ్యం, చిన్న మద్దయ్య సంఘీభావం తెలిపారు. పగిడ్యాలలో నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. సీఐటీయు డివిజన్ నాయకులు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మద్దతు ప్రకటించారు. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఈ హరిత, మండల నాయకురాల్లు నాగమణి,రమణమ్మ పాల్గొన్నారు. సచివాలయాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను నడిపించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాల వచ్చాయని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారమయ్యేంత మరకు సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తారని తెలిపారు.

రామోజీ.. విషపు రాతలు మానుకో

- పసిపిల్లలపై నిందలు వేసిన రామోజీ క్షమాపణలు చెప్పాలి
- ప్రభుత్వంపై అక్కసుతోనే దుష్ప్రచారం
- 'ఈనాడు'తప్పుడు రాతలపై ఎమ్మెల్యే శిల్పా ధ్వజం

ఆత్మకూరురూరల్: నిరుపేద ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉన్నత స్థాయి కంటెంట్‌తో విద్య అందించాలనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్యాబ్‌లు ఇస్తే వాటిలో పిల్లలు అశ్లీల వీడియోలు చూస్తున్నారంటూ తప్పుడు రాతలు రాయించిన ఈనాడు పత్రికాధిపతి రామోజీరావు పేద విద్యార్థులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెడితే ఇలాగే పేద ప్రజలపై విషపురాతలు రాయించారన్నారు. నిరుపేద పిల్లలకు ట్యాబ్‌ల ద్వారా బైజూస్ లాంటి అత్యున్నత కంటెంట్ అందిస్తుంటే వారు బూతు చిత్రాలు చూస్తున్నారని రాయడం విషం కక్కడం కాక మరేమిటి అని ప్రశ్నించారు. పేద విద్యార్థులు విజ్ఞాన సముపార్జనకు కాకుండా అనైతిక విషయాలకు ఉపయోగిస్తున్నట్లు నిరూపించాలని లేని పక్షంలో నిరుపేదల పిల్లలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు.